సాక్షి నల్లగొండ

మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



పాల సేకరణ ధర తగ్గింపు

పాడి రైతులకు ప్రోత్సాహం కరువైంది. డెయిరీలు పాలసేకరణ ధర తగ్గిస్తుండడంతో నష్టపోతున్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 589.30 అడుగులు
ఇన్‌ఫ్లో	: 44,152 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 44,152 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,867 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10,120 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 2,765 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1,800
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం :	644.28 అడుగులు
ఇన్‌ఫ్లో	: 3,053 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 4,489 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 267 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 267 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

డాక్టర్ పోస్టులకు దరఖాస్తులు

నల్లగొండ టౌన్ : జిల్లా వైద్య శాఖ పరిధిలో ఎన్‌హెచ్‌ఎం, ఈజేహెచ్ఎస్ వైద్యాధికారులు, చిన్న పిల్లల వైద్య నిపుణుడి పోస్టులకు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేయడానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్య శాఖ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

25 నుంచి ఐటీఐల్లో స్పాట్ అడ్మిషన్లు

నల్లగొండ : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మిగిలిన సీట్ల కోసం ఈ నెల 23 నుంచి 28 వరకు స్పాట్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు నల్లగొండ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నర్సింహాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25 నుంచి 28 వరకు రోజూ ఉదయం 11 గంటలకు అప్లికేషన్ ప్రింటెడ్ కాపీ, ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా నల్లగొండ ఐటీఐ కళాశాలకు హాజరు కావాలని పేర్కొన్నారు. iti.telangana.gov.inలో వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 99489 47670 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చెర్వుగట్టు ప్రసాదాల తయారీకి విజయ నెయ్యి



లడ్డూలు తయారు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రసాదాలు తయారీకి విజయ డైయిరీ ఆవు నెయ్యి ఉపయోగించాలని దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హనుమంతరావు ఆదేశాలు జారీ చేసినట్లు ఆలయ ఈఓ నవీన్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఆలయంలో ఏడాదికి దాదాపు 10 లక్షల వరకు లడ్డూలు తయారు చేస్తారు. వాటి తయారీకి మదర్ డైయిరీ నెయ్యి వాడుతున్నారు. ఇప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన విజయ డైయిరీ నెయ్యిని వాడాలని ఆదేశాలు అందాయి.

నీటి పరిరక్షణ ల్యాబ్ ఉద్యోగుల కమిటీ ఎన్నిక



ఎన్నికైన నీటి పరిరక్షణ ల్యాబ్ ఉద్యోగుల కార్యవర్గం

నల్లగొండ : మిషన్ భగీరథ నీటి నాణ్యత, పరిశీలన, పరిరక్షణ ల్యాబ్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గాన్ని సోమవారం నల్లగొండలోని టీఎన్‌జీఓ భవన్‌లో పి.వీరారెడ్డి అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా జి.క్రాంతికుమార్, ఉపాధ్యక్షులుగా బి.సత్యనారాయణ, ఎం.పరశురాములు, జనరల్ సెక్రటరీగా జి.భానుప్రసాద్, జాయింట్ సెక్రటరీగా ఎ.కిషన్, ఆర్.రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బి.హనుమంతు, జి.సతీష్, ట్రెజరరీగా డి.అనురాధ, ఈసీ సభ్యులుగా రాజన్న, కిరణ్‌కుమార్‌రెడ్డి, బి.రమేష్, జి. ఉపేందర్, బి.బాలకృష్ణ ఎన్నికయ్యారు.

శివుడికి విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సంప్రదాయ పూజలు చేపట్టారు. శివుడికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన తదితర పూజలు నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలోనూ నిత్య పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ, ఆరాధన, అనంతరం నిజాభిషేకం, తులసీదళ అర్చన చేశారు. అలాగే ఆలయ ముఖమండపం, ప్రాకార మండపంలో సుదర్శనహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, సువర్ణ పుష్పార్చన తదితర పూజలు నిర్వహించారు.



స్పటిక లింగానికి పూజలు చేస్తున్న అర్చకులు

● పరిశుభ్రత



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నల్లగొండలోని రామాలయం పరిసరాలను శుభ్రం చేస్తున్న మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

● పరిశీలన



మర్రిగూడ : క్షేత్ర పర్యటనలో భాగంగా సోమవారం మాల్ (వెంకటేశ్వరనగర్)లోని ఓ దుకాణాన్ని పరిశీలిస్తున్న మర్రిగూడ ఆదర్శ పాఠశాల ఇంటర్ విద్యార్థులు

సాఫీగా.. నీటి సరఫరా!

మంచినీటి సహాయకులుగా మల్టీపర్పస్ వర్కర్ల వినియోగం

- నీటి సరఫరాలో ఇబ్బందులు తొలగించేందుకు ప్రణాళిక
- వారికి మిషన్ భగీరథ ఆధ్వర్యంలో నేటి నుంచి శిక్షణ
- 21 లొకేషన్ల పరిధిలో నవంబర్ నాటికి శిక్షణ పూర్తి చేసేలా ఏర్పాట్లు



నల్లగొండ : గ్రామాల్లో మంచి నీటి సరఫరాలో ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. గ్రామాల్లో ఉన్న మల్టీపర్పస్ వర్కర్లను.. గ్రామ మంచినీటి సహాయకుడిగా ఉపయోగించనున్నారు. ఇప్పటి వరకు గ్రామాల్లో పారిశుద్ధ్య, ఇతర పనులు నిర్వహించే మల్టీపర్పస్ వర్కర్లకే గ్రామంలో మంచినీటికి సంబంధించిన కూడా బాధ్యత కూడా అప్పగిస్తోంది. తాగునీటి నాణ్యత పరిశీలన, చేతి పంపు, మోటారు, పైపులైన్ల లీకేజీ మరమ్మతులు వారి చేతే చేయించనున్నారు. ఇందు కోసం వారికి మిషన్‌భగీరథ ఆధ్వర్యంలో నేటి నుంచి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తున్నారు. 21 లొకేషన్ల పరిధిలో నలుగురు మాస్టర్ ట్రెయినర్ల చేత శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాలోని 844 పాత గ్రామ పంచాయతీల్లోని చదువుకున్న మల్టీ పర్పస్ వర్కర్లను ఇప్పటికే గుర్తించారు. వృద్ధులు మినహా మిగిలిన అందరికీ నవంబర్ నాటికి ఈ శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నారు.

రోజుకు ఒక అంశంపై శిక్షణ

మల్టీపర్పస్ వర్కర్లకు నాలుగు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఒక రోజు చేతి పంపుల మరమ్మతు, రెండో రోజు తాగునీటి మోటారు మరమ్మతు, మూడోరోజు నీటి నాణ్యత ఏ విధంగా తెలుసుకోవాలనే విషయంపై, నాలుగో రోజు పైపులైన్ల లీకేజీ మరమ్మతుపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 24న ప్రారంభం కానున్న శిక్షణ తరగతులను ఆయా మండలాల వారీగా నవంబరు మొదటి వారం వరకు అన్ని పూర్తి చేయనున్నారు. కొత్తగా ఏర్పడ్డ 24 గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్లను నియమిస్తారా.. లేక ఇప్పటికే ఉన్నవారినే ఆ గ్రామాలకు పంపుతారా అనేది తెలలేదు.

సమస్యను వెంటనే పరిష్కరించేలా..

గతంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఉండేది. ఆ శాఖ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా జరిగేది. చేతి పంపులు, మోటార్ల మరమ్మతు తదితర వాటికి ప్రత్యేకంగా సిబ్బంది ఉండేవారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిషన్ భగీరథను తీసుకొచ్చి ఇంటింటికి తాగునీరు అందించే కార్యక్రమాన్ని చేపట్టింది. చేతి పంపులను పూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం ఏవైనా ఇబ్బందికర పరిస్థితులు ఎదురై మిషన్ భగీరథ నీటి సరఫరా ఆగిపోయిన సందర్భంలోనే చేతిపంపులను ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు మల్టీ పర్పస్ వర్కర్లకు శిక్షణ ఇచ్చి నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మొదటి రోజు మూడు చోట్ల..

మొదటి రోజు మంగళవారం నల్లగొండ, తిప్పర్తి మండలాలకు సంబంధించిన మల్టీపర్పస్ వర్కర్లకు నల్లగొండలో, మునుగోడు, చండూరు మండలాలకు చెందిన వారికి మునుగోడులో, నకిరేకల్, శాలిగౌరారం, కేతేపల్లి మండలాలకు చెందిన మల్టీపర్పస్ వర్కర్లకు నకిరేకల్‌లో శిక్షణ ఇవ్వనున్నారు.

నాలుగు రోజులు శిక్షణ



గ్రామంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించుకునే విధంగా ప్రభుత్వం మల్టీ పర్పస్ వర్కర్లను గ్రామ మంచినీటి సహాయకుడిగా నియమించింది. వారందరికీ గ్రామంలో తాగునీటి సరఫరాలో నాణ్యత పరిశీలించడం, చేతి పంపులు, తాగునీటి మోటారు మరమ్మతుతో పాటు గ్రామంలో ఎక్కడైనా పైపుల లీకేజీ వంటి సమస్యను ఏ విధంగా పరిష్కరించుకోవాలని అనే విషయంపై నలుగురు మాస్టర్ ట్రెయినర్లు నాలుగు రోజుల పాటు శిక్షణ ఇస్తారు. మంగళవారం నుంచి ప్రారంభమయ్యే శిక్షణ నవంబరు మొదటి వారం లోగా అన్ని మండలాల్లో పూర్తి చేస్తాం.

– వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఎస్ఈ

బాధితులకు న్యాయం చేయాలి



సమస్య వింటున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం : వివిధ సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డేలో 57 మంది బాధితుల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలు విని.. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు సేకరించాలని ఆదేశించారు. బాధితుల ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షిస్తామన్నారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.

న్యాయ సహకార సంఘం 26వ వార్షికోత్సవం



వార్షిక నివేదికను ఆవిష్కరిస్తున్న న్యాయ శాఖ ఉద్యోగులు

రామగిరి(నల్లగొండ) : ఉమ్మడి నల్లగొండ జిల్లా న్యాయ శాఖ ఉద్యోగులు సహాయ సహకార సంఘం 26 వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం జిల్లా న్యాయ సేవా సదన్‌లో సోమవారం నిర్వహించారు. సహకార సంఘం అధ్యక్షుడు నాగుబండి వినోద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నల్లగొండ జిల్లా న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.వీరబాబు 2024–25 వార్షిక నివేదికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కె.వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్, కోశాధికారి కె.యాదగిరి, డైరెక్టర్స్ పి.శ్రీనివాస్ చార్యులు, ఏ.శ్రీనివాస్, ఎస్.అంజయ్య, డి.నాగేందర్, యాదగిరి, ఎల్.సత్యానారాయణ, ఎం.రాజన్, కె.శేఖర్‌రెడ్డి, పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

బెలూన్ సిలిండర్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా అందిస్తున్న రూ.500కే గ్యాస్ సిలిండర్‌పై ప్రచార నిమిత్తం నల్లగొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన బెలూన్ చూపరులను ఆకర్షిస్తోంది

-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నల్లగొండ

నకిలీ విత్తనాలు నట్టేట ముంచాయి



పొట్టకొచ్చిన వరిచేను



విత్తనాల బ్యాగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

- నాటేసిన 45 రోజులకే పొట్టకొచ్చిన వరి చేను

చింతపల్లి : ఆరుగాలం శ్రమించి పంట సాగుచేసే రైతుకు నకిలీ విత్తనాలు బెడద తప్పడంలేదు. లక్షల రూపాయల్లో పెట్టుబడులు వెచ్చించి.. సాగు చేసిన వరి చేను నాటేసిన 45 రోజులకే పొట్టదశ కొచ్చి ఈనుతోంది. వివరాల ప్రకారం.. చింతపల్లి మండల కేంద్రానికి చెందిన రైతు కొండారి వెంకటయ్య చెరువు కింద నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని 1010 రకం విత్తనాలను మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో కొనుగోలు చేశాడు. నారు పోసిన నెల తర్వాత నాటు వేశాడు. ఆ తర్వాత 45 రోజుల్లోనే వరి చేను పొట్ట దశకు రావడంతో రైతు దిక్కుతోచని స్థితిలో చేసేదిలేక అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. సాధారణంగా వరి పంట నారు పోసిన నాటి నుంచి 120 నుంచి 150 రోజులకు చేతికొస్తుంది. కానీ కేవలం 75 రోజులకే పొట్టదశకు చేరుకోవడంతో అవి నకిలీ విత్తనాలని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే సుమారు రెండు లక్షల రూపాయల పెట్టుబడి పెట్టానని.. తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు. ఆ రైతు పొలాన్ని సోమవారం వ్యవసాయ శాఖ అధికారి శ్రావణి కుమారి, ఏఈఓ నరసింహులు పరిశీలించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలను పిలిపించి ఎక్కడ లోపం ఉన్నదో గుర్తిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు
30న నోటిఫికేషన్

అదే రోజు నుంచి ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం

- వచ్చే ఏడాది మార్చి 29తో ముగియనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవీ కాలం
- ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్న రాష్ట్ర ఎన్నికల సంఘం
- వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 తరువాత ఎన్నికల నోటిఫికేషన్



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవీ కాలం ముగింపు గడువు సమీపిస్తోంది. ప్రస్తుత టీచర్స్ ఎమ్మెల్సీగా ఉన్న నర్సిరెడ్డి పదవీకాలం వచ్చే ఏడాది మార్చి 29తో ముగియనుంది. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం టీచర్ ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు సిద్ధమవుతోంది. ఈ నెల 30న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటర్ల నమోదుకు నోటీసు జారీచేయనుంది. ఈ మేరకు షెడ్యూలుతో కూడిన ఉత్తర్వులను జూలై లోనే రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి జారీచేశారు. ఓటరు నమోదు అధికారిగా నల్లగొండ డీఆర్వో రాజ్యలక్ష్మి వ్యవహరించనున్నారు. ఈ నెల 30న ఓటరు నమోదుకు పబ్లిక్ నోటీసు విడుదల చేసి అదే రోజు నుంచి ఓటరు నమోదును ప్రారంభిస్తారు.

రెండు విధాలుగా ఓటు నమోదు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి ఓటు నమోదు ప్రక్రియ రెండు విధాలుగా చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఆఫ్‌లైన్‌లో ఫామ్–19 ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో ceotelangana.nic.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఓటరు నమోదుకు నవంబరు 6వ తేదీ చివరి గడువుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. అక్టోబరు 16న ఒకసారి, 25వ తేదీన మరోసారి ఓటు నమోదు కోసం నోటీసును ఎన్నికల అధికారులు జారీచేయనున్నారు.

అందరూ ఓటు నమోదు చేసుకోవాల్సిందే

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం గతంలో ఓటు నమోదు చేసుకున్న వారు కూడా తిరిగి ఇప్పుడు మళ్లీ ఓటు నమోదు చేసుకోవాల్సిందే. ఒకసారి ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదు చేసుకున్నా, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఆ ఎన్నికలు పూర్తయ్యాక ఆ ఓటర్ల జాబితా రద్దవుతుంది. దీంతో మళ్లీ ఎన్నికలు వచ్చినప్పుడు టీచర్లు కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

నవంబరు 23న ముసాయిదా ఓటరు జాబితా

ఈ నెల 30వ తేదీ నుంచి ఓటరు నమోదు ప్రారంభం కానుండగా, నమోదు ప్రక్రియ నవంబరు 6వ తేదీ వరకు పూర్తి కానుంది. ఆ తరువాత నవంబర్ 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటిస్తారు.

డిసెంబరు 30న తుది జాబితా

ముసాయిదా జాబితా ప్రకటన తరువాత.. ఆ జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. వాటిని పరిష్కరించిన తరువాత అధికారులు డిసెంబరు 30న తుది ఓటరు జాబితా ప్రకటిస్తారు.

ఫిబ్రవరిలో ఎన్నికల నోటిఫికేషన్?

ప్రస్తుత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవీ కాలం 2025 మార్చి 29తో ముగియనుంది. ఆ తేదీకి ముందే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 15వ తేదీ నుంచి 20వ తేదీ మధ్యలో ఎన్నికల నోటిఫికేషన్ జారీచేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

పెరగనున్న ఓటర్లు

గతంలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 20,585 మంది ఓటు కోసం నమోదు చేసుకున్నారు. ఈసారి ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. హైస్కూల్‌లో పనిచేసే టీచర్లతోపాటు పాటు యూనివర్సిటీలో పనిచేసే అధ్యాపకులంతా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటు నమోదు చేసుకోవచ్చు. అలాగే కొన్ని నిబంధనల మేరకు ప్రైవేటు టీచర్లు కూడా ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉంది. మూడేళ్ల పాటు వరుసగా సర్వీసు రిజిస్టర్‌లో వారి పేర్లు ఉండి, యూడైస్‌లో వివరాలు నమోదై ఉండి, వేతనాలు బ్యాంకు అకౌంట్ ద్వారా పొందుతూ, పీఎఫ్ కట్ అయ్యే ప్రైవేటు టీచర్లు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.

28న జిల్లాస్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్

నల్లగొండ : జిల్లాస్థాయి సైన్స్ డ్రామా, జాతీయ సైన్స్ సెమినార్ పోటీలను ఈ నెల 28న ఉదయం 10 గంటలకు నల్లగొండలోని డైట్ కళాశాలలో నిర్వహించనున్నట్లు డీఈఓ భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలజీ మ్యూజియం బెంగుళూర్ రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణ మండలి ఆధ్వర్యంలో జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 27లోపు జిల్లాలోని ఆయా మండలాల్లో మండల విద్యాధికారులు సైన్స్ డ్రామా ఫెస్టివల్, సెమినార్లు నిర్వహించి అందులో ప్రథమస్థానం పొందిన విజేతలు ఈ నెల 28న నల్లగొండలో పాల్గొనేలా చూడాలని సూచించారు. ప్రదర్శనలో సందేశాత్మక విజ్ఞానశాస్త్ర సమాచారం అందిస్తూ కాస్ట్యూమ్స్, డ్యాన్స్, మ్యూజిక్ బ్యానర్లు ఉపయోగించవచ్చని తెలిపారు. సైన్స్ డ్రామాఫెస్టివల్‌లో ప్రపంచ నీటి సంక్షోభం, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, విపత్తు నివారణకు ఆధునిక సాంకేతికత, ఆరోగ్యం పరిశుభ్రత, వాతావరణ మార్పు ప్రభావం అంశాలపై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి 9848578845 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

వరల్డ్‌వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



తాను సాధించిన రికార్డ్స్‌తో మను శ్రీరామ్

మిర్యాలగూడ అర్బన్: భారతదేశ రాష్ట్రాలు, రాజధానులను 15.8 సెకండ్లలో చెప్పి వరల్డ్‌వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు దక్కించుకున్నాడు ఈ 4వ తరగతి చదువుతున్న ఎనిమిది సంవత్సారాల బుడతడు. మిర్యాలగూడ పట్టణంలోని మార్క్‌కేర్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ నవీన్‌కుమార్, శ్వేత కుమారుడు రాపర్తి మనుశ్రీరాం అంతకుముందు ఉన్న 19 సెకండ్ల రికార్డును అధికమించి కేవలం 15.8 సెకండ్లలో చెప్పడంతో చోటు దక్కినట్లు నవీన్‌కుమార్ తెలిపారు. చిన్నతనంలో ఇంతటి ప్రతిభ కనబర్చిన మను శ్రీరామ్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయవద్దని, పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను వారంలోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం మొత్తం 58 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రభలకుండా చూడాలి

సీజనల్ వ్యాధులు ప్రభలకుండా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన జిల్లా అధికారులతో సమ్మిళిత సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వ, ఏరియా ఆస్పత్రుల్లో ప్రైమరీ హెల్త్ సెంటర్లలో సీజనల్ వ్యాధుల బారిన పడిన వారికి వెంటనే చికిత్స అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు అయ్యే విధంగా చూడాలని, అన్ని ఆస్పత్రుల్లో ఎలాంటి మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విజయ డెయిరీ పాలనే వాడాలని సూచించారు. గ్రామాల్లో నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలని, ఫాగింగ్ చేయాలని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణఅమిత్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పెన్‌పహాడ్: ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని సోమవారం పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన పిండిప్రోలు పర్వతాలు అదే గ్రామానికి చెందిన నకిరేకంటి భిక్షం ఇంట్లోని రేకుల షెడ్డు కింద 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసుకున్నాడు. పక్కా సమాచారం మేరకు పోలీసులు సోమవారం దాడి చేసి బియ్యాన్ని సీజ్ చేశారు. సివిల్ సప్లయ్ అధికారులు పంచనామా చేసి స్థానిక డీలర్‌కు బియ్యం అందజేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆపిల్ లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలో 65వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఆపిల్ లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తాపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన లారీ ఆపిల్ లోడ్‌తో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తోంది. మార్గమధ్యలో దండు మల్కాపురం గ్రామ స్టేజీ దాటగానే మూలమలుపు వద్ద లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునేసరికి ఆలస్యం కావడంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు ఆపిల్ పండ్లను తీసుకుని వెళ్లారు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలు కాగా.. చికిత్స కోసం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్ తెలిపారు.

దొంగ రిమాండ్

కోదాడరూరల్: షాపుల్లో చోరీకి పాల్పడుతున్న దొంగను కోదాడ పట్టణ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం ఎర్రకాలువ గ్రామానికి చెందిన లావూరి సైదా అలియాస్ సైదులు జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు చేస్తున్నాడు. గతంలో మిర్యాలగూడ పట్టణంలో దొంగతనాలు చేస్తూ పోలీసులకు చిక్కి జైలుకు కూడా వెళ్లాడు. ఇటీవల జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత సూర్యాపేట టూటౌన్ పోలీస్ పరిధిలోని ఓ షాపులో, కోదాడ పట్టణ పరిధిలోని ఆరు షాపుల్లో చోరీలకు పాల్పడ్డాడు. మళ్లీ దొంగతనం చేసేందుకు కోదాడకు రాగా ఖమ్మం క్రాస్‌రోడ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. దీంతో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కానిస్టేబుల్ మృతి



జానయ్య (ఫైల్)

కేతేపల్లి: కేతేపల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కిన్నెర జానయ్య(40) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. తిప్పర్తి మండల కేంద్రానికి చెందిన జానయ్య గత నాలుగేళ్లుగా కేతేపల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జానయ్య మృతి పట్ల కేతేపల్లి ఎస్ఐ శివతేజ, సిబ్బంది సతాపం వ్యక్తం చేశారు.

పాల సేకరణ ధర తగ్గింపు

- భారీగా తగ్గించిన హెరిటేజ్
- ఇతర డెయిరీలు కూడా అదేబాటలో..
- నష్టపోతున్నామంటున్న పాడి రైతులు
- తక్కువ ధరకే ఇతర రాష్ట్రాల పాలు



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి యాదాద్రి జిల్లా రాజాపేట మండల కేంద్రానికి చెందిన బిల్లకుదురు శేఖర్. ఈయనకు ఐదు ఆవులు, రెండు పాడి గేదెలు ఉన్నాయి. ఇందులో ఆవుపాలు ప్రతిరోజు 40 లీటర్లు మదర్ డెయిరీ పాల సేకరణ కేంద్రంలో పోస్తున్నాడు. ఇటీవల ఆవుపాల ధర మదర్ డెయిరీ లీటకు రూ.2 తగ్గించింది. దీంతో ఆయనకు నెలకు రూ.2400 ఆదాయం తగ్గింది. కుటుంబమంతా శ్రమిస్తే నెలకు రూ.10వేలు కూడా ఆదాయం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మూగజీవాలను వదిలేసే పరిస్థితి లేదని తెలిపాడు.

సాక్షి, యాదాద్రి: పాల సేకరణ ధర తగ్గిస్తూ డెయిరీలు రైతులను నష్టాలపాలు చేస్తున్నాయి. ప్రధానంగా ఆవు పాల ధర ఇటీవల తగ్గించి కొనుగోలు చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి తక్కువ ధరకు వస్తున్న పాలతో రాష్ట్ర రైతులకు తీరని నష్టం కలుగుతోంది. అయితే ఇక్కడ పాలను సేకరించి విక్రయించే డెయిరీలు కూడా తక్కువ ధరకు వస్తున్న ఇతర రాష్ట్రాల పాలను కొనుగోలు చేస్తున్నాయి. దీంతో పాల దిగుబడి పెరిగిందని.. రైతులకు ఇచ్చే లీటరు పాల ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నాయి. తగ్గించిన పాల ధరలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్రంలో పలువురు పాడి రైతులు అప్పుల పాలై తమ డెయిరీలను మూసివేసి పశువులను అమ్మేస్తున్నారు.



రాజాపేటలోని మదర్ డెయిరీ పాలసేకరణ కేంద్రంలో పాలు పోస్తున్న రైతులు

లీటరు రూ.36కు తగ్గించిన హెరిటేజ్

యాదాద్రి భువనగిరి జిల్లాలో గత సంవత్సరం ఇదే సమయంలో ఆవు పాల ధర లీటరుకు హెరిటేజ్ డెయిరీ రైతుకు రూ.47 ఇవ్వగా, ప్రస్తుతం రూ.36కు తగ్గించింది. రెట్టింపు పాలు ఉత్పత్తి అవుతున్నాయనే కారణం చూపుతూ పాల ధర తగ్గించారు. దీంతో ధర గిట్టుబాటు కావడం లేదని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోజుకు 16లక్షల లీటర్ల పాలు సేకరిస్తున్న డెయిరీలు

ఆవు, గేదె పాలు ప్రతిరోజు వివిధ డెయిరీలు సుమారు 16 లక్షల లీటర్లు సేకరిస్తున్నాయి. ఇందులో హెరిటేజ్ డెయిరీ ఒక్కటే 5.50 లక్షల లీటర్ల పాలు సేకరిస్తోంది. తర్వాత విజయా మిల్క్ డెయిరీ, జెర్సీ డెయిరీలు లక్ష లీటర్లకు మించి సేకరిస్తున్నాయి. ఈ పాలను అత్యధికంగా హైదరాబాద్ మహానగరంలోనే విక్రయిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రతోపాటు మన రాష్ట్రంలో వివిధ డెయిరీలు పాలసేకరణతో పాటు వినియోగదారులకు పాలు సరఫరా చేస్తున్నాయి. ఇందులో హెరిటేజ్, నార్మల్, విజయ డెయిరీ, కృష్ణ విజయ మిల్క్, నెల్లూరు విజయ మిల్క్, ఏపీ విజయా మిల్క్, కరీంనగర్ మిల్క్, జెర్సీ మిల్క్, దొడ్ల మిల్క్, తిరుమల మిల్క్, మస్కతి మిల్క్, వీఎస్ఆర్, అమూల్ మిల్క్, నందిని మిల్క్, నాచురల్ డిలైట్ మిల్క్, నాగార్జున మిల్క్, వల్లభా మిల్క్, శ్రీజా మిల్క్, న్యూ మార్నింగ్ మిల్క్, గాయత్రి మిల్క్, ఇతర స్థానిక బ్రాండ్ల పేరుతో వచ్చే పాలు వస్తున్నాయి.

శ్రమకు తగిన ఫలితం లేకుండా పోతోంది



హెరిటేజ్ డెయిరీ నవంబర్‌లో లీటర్ పాలకు రూ.45 ఇవ్వగా ప్రస్తుతం రూ.36కు తగ్గించారు. నాకు 80 పాడి ఆవులు ఉన్నాయి. వీటితో రోజుకు 200 లీటర్ల పాలు హెరిటేజ్ డెయిరీకి పోస్తున్నా. దాణా, మందుల ఖర్చులు పెరిగిపోయాయి. రోజంతా పడిన శ్రమకు తగిన ఫలితం లభించడంలేదు.

– బొట్టు అబ్బయ్య, పాడి రైతు, కప్రాయపల్లి

ప్రభుత్వం చేతులెత్తేసింది



ఇతర రాష్ట్రాల ప్రైవేట్ డెయిరీల నుంచి విపరీతంగా వస్తున్న పాలను నియంత్రించడంలో ప్రభుత్వం చేతులెత్తేసింది. గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి లీటరు పాలు రూ.27 కే హైదరాబాద్ తెచ్చి పోస్తున్నారు. దీంతో స్థానిక డెయిరీలు ఎలాంటి సేకరణ ఖర్చు లేకుండా ఇతర రాష్ట్రాల పాలను కొంటున్నాయి. ఏపీకి చెందిన హెరిటేజ్ డెయిరీ కూడా స్థానిక రైతుల పాలకు తక్కువ ధర చెల్లిస్తుంది. లీటరు ఆవుపాల ధరను రూ.47 నుంచి రూ.36కు తగ్గించింది. తీవ్రంగా నష్టపోతున్న పాడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఇతర రాష్ట్రాల పాలను నియంత్రించాలి.

– కందాడి బాల్‌రెడ్డి, పాడి రైతు, ఏదుళ్లగూడెం

కౌన్సిలర్ భర్తపై కత్తులతో దాడి

- ర్యాష్ డ్రైవింగ్ గురించి ప్రశ్నించిన అరుణ్‌కుమార్‌పై దాడిచేసిన యువకులు
- మరో ఇద్దరిపై కూడా..
- విషయం తెలుసుకుని యువకులను చితకబాదిన స్థానికులు
- చౌటుప్పల్ పట్టణంలో ఉద్రిక్తత



గాయపడిన దండ అరుణ్‌కుమార్

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు, మున్సిపల్ కౌన్సిలర్ హిమబిందు భర్త దండ అరుణ్‌కుమార్‌పై గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ నుంచి అంజనసాయి మెడోస్ వెంచర్ వైపునకు సోమవారం రాత్రి ఓ కారులో ముగ్గురు యువకులు వేగంగా దూసుకెళ్లారు. చిన్న గల్లీలో కారు వేగంగా వెళ్లడంతో అరుణ్‌కుమార్‌తో పాటు స్థానిక యువకులు కలిసి వారిని ప్రశ్నించారు. దీంతో కారులో ఉన్న ముగ్గురు యువకులు ఆగ్రహానికి గురై తమనే ప్రశ్నిస్తారా అంటూ అరణ్‌కుమార్‌తో పాటు స్థానిక యువకులపై పిడిగుద్దులు గుద్దారు. తమ వద్ద ఉన్న కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో అరుణ్‌కుమార్‌తో పాటు అతని వెంట ఉన్న స్థానిక యువకులు సుర్కంటి బాలకృష్ణారెడ్డి, సుర్వి సురేందర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తమ వారిపై దాడి జరిగిన విషయం తెలుసుకున్న మరికొంత మంది స్థానిక యువకులు అంజనసాయి మెడోస్ వెంచర్ సమీపంలోని తిరుమల వెంచర్ వద్దకు వెళ్లి కారులో వెళ్తున్న యువకుల వెంటపడ్డారు. వారి నుంచి తప్పించుకునే క్రమంలో కారులో ఉన్న యువకులు సమీపంలో ఉన్న భవనం పైకి ఎక్కారు. అక్కడి నుంచి ఆ యువకులు దిందకు దూకగా.. వారిని పట్టుకుని చితకబాదారు. ఈ క్రమంలో ముగ్గురు యువకులకు కూడా గాయాలయ్యాయి. అరుణ్‌కుమార్‌తో పాటు కారులోని ఇద్దరు యువకులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాపర్ వైర్లు చోరీ చేస్తున్న ముఠా అరెస్ట్



అరెస్ట్ చేసిన దొంగలను చూపుతున్న డీసీపీ రాజేష్‌చంద్ర, పోలీసు అధికారులు

- రూ.35లక్షల సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీఎస్పీ రాజేష్ చంద్ర

భువనగిరి క్రైం, బొమ్మలరామారం: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్లు చోరీ చేస్తున్న 8మంది ముఠా సభ్యులను బొమ్మలరామారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర సోమవారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. బిహార్ రాష్ట్రానికి చెందిన బిక్రమ్ కిమార్ సింగ్, మహేందర్ రామ్, రామ్‌కుమార్ సింగ్, గోవింద్ మండల్, శ్రవణ్ మంటో, ప్రదీప్ కుమార్ మిశ్రా, రాజకుమార్ రాయ్, అమిత్ కలిసి ముఠాగా ఏర్పడి ఉదయం వేళలో కారులో గ్రామాల్లో రెక్కీ నిర్వహించి, రాత్రివేళ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని కాపర్ వైర్లు, విద్యుత్ స్తంభాల నుంచి అల్యూమినియం వైర్ల చోరీకి పాల్పడుతున్నారు. సోమవారం తెల్లవారుజామున బొమ్మలరామారం మండలంలోని చీకటిమామిడి గ్రామ ఎక్స్ రోడ్ వద్ద ఎస్ఐ శ్రీశైలం నేతృత్వంలో పోలీస్ సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తుర్కపల్లి వైపు నుంచి వాహనంలో 8మంది వ్యక్తులు వెళ్తున్నారు. వారి వాహనంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్లతో పాటు విద్యుత్ స్తంభాలపై ఉండే అల్యూమినియం వైర్లు ఉండడంతో పోలీసులు వారిని ప్రశ్నించారు. వారు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అదుపులోకి తీసుకుని విచారించగా.. పట్టుబడిన ఎనిమిది మంది ముఠాగా ఏర్పడి యాదాద్రి భువనగిరి జిల్లాతో పాటు మల్కాజిగిరి జోన్ పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైర్లు, విద్యుత్ స్తంభాల నుంచి అల్యూమినియం వైర్లు చోరీలకు పాల్పడుతున్నట్లు నిజం ఒప్పుకున్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీరిపై 46 చోరీ కేసులు ఉన్నట్లుగా గుర్తించారు. వారి నుంచి రూ.2,73,000 నగదు, రెండు కార్లు, ఒక ట్రాలీ ఆటో, 200 కిలోల రాగి వైర్లు, 8 సెల్‌ఫోన్లతో చోరీకి ఉపయోగించిన ఉపకరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ సుమారు రూ.35 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన బొమ్మలరామారం పోలీసులను డీసీపీ అభినందించి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, భువనగిరి రూరల్ సీఐ ప్రభాకర్ రెడ్డి, బొమ్మలరామారం ఎస్ఐ శ్రీశైలం, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రాజు, మహబూబ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు.. దంపతులకు గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

అర్వపల్లి: ఆటోను కారు ఢీకొనడంతో దంపతులకు గాయాలయ్యాయి. ఈ ఘటన జాజిరెడ్డిగూడెం మండలం జ్యోతులనగర్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. అడివెంల గ్రామానికి చెందిన అనపర్తి వెంకన్న, ఆయన భార్య సైదమ్మ ఇద్దరు ఆదివారం ఉదయం తమ ఆటోలో సూర్యాపేటకు వెళ్లి రాత్రి తిరిగి ఇంటికి వస్తున్నారు. మార్గమధ్యలో దగా జ్యోతులనగర్ సమీపంలో సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై తిరుమలగిరి వైపు నుంచి ఎదురుగా వచ్చిన కారు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకన్న, సైదమ్మకు గాయాలయ్యాయి. వారిని స్థానికులు 108 వాహనంలో సూర్యాపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

చౌటుప్పల్ రూరల్: బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గట్టుప్పల్ మండలం వెల్మకన్నె గ్రామానికి చెందిన పెట్టగళ్లా చినజంగయ్య(55) బైక్‌పై వెల్మకన్నె నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలోని ఓ పెట్రోల్ పంపు ఎదురుగా 65వ నంబర్ జాతీయ రహదారిపై వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జంగయ్య తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. జంగయ్య బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాదగిరి తెలిపారు.

యువకుడి అదృశ్యం

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణ పరిధిలోని తాతానగర్‌కు చెందిన ముదిగొండ రాజ్‌కమల్ ఆదివారం రాత్రి నుంచి కనిపించడంలేదని అతడి కుటుంబ సభ్యులు సోమవారం భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానికంగా ఎలక్ట్రికల్ షాపులో పనిచేస్తున్న రాజ్‌కమల్ ఆదివారం రాత్రి బైక్‌పై ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. సోమవారం సాయంత్రం వరకు ఆచూకీ లభించకపోవడంతో రాజ్‌కమల్ కుటుంబ సభ్యులు భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

కళాశాల భవనం పైనుంచి పడిన విద్యార్థి

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- మృతుడి స్వస్థలం చివ్వెంల మండలం జి. తిరుమలగిరి గ్రామం

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న మట్టపల్లి లోకేష్(16) మృతిచెందాడు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం జి.తిరుమలగిరికి చెందిన తిరుపతమ్మ కుమారుడు లోకేష్ ఖమ్మంలోని ప్రైవేట్ కళాశాలలో చదువుతూ అదే కళాశాల హాస్టల్‌లో ఉంటున్నాడు. ఆదివారం రాత్రి కళాశాల భవనం రెండో అంతస్తు నుంచి లోకేష్ కింద పడగా తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కాగా, మృతుడి కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు న్యాయం చేయాలనే డిమాండ్‌తో కళాశాల వద్ద ఆందోళన నిర్వహించారు. లోకేష్ మృతికి కళాశాల యాజమన్యం నిర్లక్ష్యమే కారణమని లోకేష్ కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

పెళ్లిపీటలు ఎక్కాల్సిన యువకుడు మృత్యుఒడికి..

- బంధువు అంత్యక్రియలకు వెళ్లొస్తూ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం

పెద్దవూర: త్వరలో పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి పెద్దవూర మండల పరిధిలోని ముసలమ్మచెట్టు గ్రామ స్టేజీ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం సంగారం గ్రామానికి చెందిన మాతంగి రాములు అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందాడు. అతడి దగ్గరి బంధువైన అనుముల మండలం పాలెం గ్రామానికి చెందిన జిల్లా నగేష్(25) తన తల్లిదండ్రులను బైక్‌పై ఎక్కించుకుని సంగారం గ్రామానికి వచ్చాడు. అంత్యక్రియలు పూర్తయ్యేసరికి సాయంత్రం అయ్యింది. ఇంటి వద్ద నాయనమ్మ ఒక్కతే ఉందని తాను ఇంటికి వెళ్తానని నగేష్ బైక్‌ను తీయడానికి ప్రయత్నించగా తల్లిదండ్రులు వారించారు. తల్లిదండ్రులు ఎంత చెప్పినా వినకుండా నగేష్ సంగారం నుంచి తన స్వగ్రామమైన పాలెం గ్రామానికి బైక్‌పై బయల్దేరాడు. మార్గమధ్యలో పెద్దవూర మండలం ముసలమ్మచెట్టు గ్రామ స్టేజీ మూలమలుపు వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం నగేష్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నగేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఇటీవలే పెళ్లి సంబంధం కుదిరిందని, త్వరలో పెళ్లిపీటలు ఎక్కాల్సిన సమయంలో విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

రజితది హత్యా..? ఆత్మహత్యా..?

- అడిషనల్ ఎస్పీ పర్యవేక్షణలో కేసు విచారణ
- నిందితులను తప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు కుటుంబ సభ్యుల ఆరోపణ

గుర్రంపోడు: మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో ఆగస్టు 29న ఉరేసుకుని మృతిచెందిన వివాహితను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని, ఈ కేసులో నిందితులను తప్పించేందుకు డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముల్కలపల్లి గ్రామానికి చెందిన జాల రజిత ఆగస్టు 29న ఇంట్లో ఉరేసుకుని మృతిచెందింది. అదేరోజు మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. ఈ నెల 9వ తేదీన అదే గ్రామానికి చెందిన జాల రాములును ఈ కేసులో అనుమానితుడిగా పోలీసులు అరెస్టు చేశారు. రజితను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారనే అనుమానాలను గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో నిందుతులను తప్పించేందుకు మృతురాలి కుటుంబానికి డబ్బులు పరిహారంగా ఇచ్చే ప్రయత్నం జరిగిందనే వార్తలు రావడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డిని ప్రశ్నించగా.. ఈ కేసులో చట్టప్రకారమే తాము వ్యవహరించామని అన్నారు.

కేసును విచారిస్తున్న అడిషనల్ ఎస్పీ

ఈ కేసును అడిషనల్ ఎస్పీ రాములు నాయక్ పర్యవేక్షణలో విచారిస్తున్నట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని అన్నారు. పోస్టుమార్టం రిపోర్ట్, ఎఫ్ఎస్ఎల్ తుది నివేదిక అనంతరం మరణానికి గల కారణాలను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నడిరోడ్డుపై కోడి పందేల నిర్వహణ

- ఇద్దరి అరెస్ట్, పరారీలో మరో ఏడుగురు

మిర్యాలగూడ అర్బన్: నడిరోడ్డుపై కోడి పందేలు నిర్వహిస్తున్నవారిని మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. టూ టౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్‌నగర్ తండా సమీపంలో కొందరు వ్యక్తులు రోడ్డుపై కోడి పందేలు ఆడుతున్నట్లు సమాచారం అందడంతో టూటౌన్ పోలీసులకు అక్కడకు చేరుకుని దాసరాజు వెంకటేష్, గోగుల ప్రశాంత్‌ను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2150, రెండు కోడిపుంజులు, రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కండెల లక్ష్మణ్, నరేందర్, కోటయ్య, బాలు, ఆంజనేయులు మారయ్య, భూపతి శ్రీను పరారీలో ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు.

వరిలో తెగుళ్లు.. నివారణ చర్యలు

నడిగూడెం: గత కొద్దిరోజులుగా వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో వరి పంటకు పురుగులు, తెగుళ్లు ఆశించి నష్టం జరుగుతోందని రైతులు వాపోతున్నారు. సరైన సమయంలో ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని నడిగూడెం మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి దేవప్రసాద్ చెబుతున్నారు. వరి పంటలో తెగుళ్ల నివారణకు అనుసరించాల్సిన విధానాలు ఆయన మాటల్లోనే..

1. కాండం తొలిచే పురుగు(మొగి పురుగు)..

నారుమడి, పిలకదశ, అంకురం నుంచి చిరుపొట్ట దశల్లో ఈ పురుగు ఆశిస్తుంది. పిలకదశలో మొవ్వు చనిపోతుంది. అంకురం నుంచి చిరుపొట్ట దశలో ఆశిస్తే ఈనిన తర్వాత తెల్లకంకులు బయటకు వస్తాయి. కంకి పాలుపోసుకోకుండా తాలు పోతుంది. చనిపోయిన మొవ్వును లాగితే తేలికగా ఊడి వస్తుంది. ఆలస్యంగా నాట్లు వేయడం, ముదురు నాట్లు నాటడం వలన ఈ పురుగు ఆశిస్తుంది.



నివారణ చర్యలు: వేసవిలో లోతు దుక్కులు దున్నాలి. నాట్లు ఆలస్యమైనప్పుడు నారు కొనలను తుంచి నాటుకోవాలి. ఎకరానికి మూడు లింగాకర్షక బుట్టలు పెట్టి ప్రతి వారం బుట్టలో పడే మగరెక్కల పురుగులను గమనించి రెక్కల పురుగుల ఉధృతిని బట్టి పురుగు మందులు పిచికారీ చేయాలి. పిలకలు, దుబ్బులు వేసే దశలో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి 10కిలోలు లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

2. సుడిదోమ(దోమపోటు): ఈ రసం పీల్చు పురుగు పిలకల దశలో అరుదుగా.. పొట్టదశ, ఈనిన దశల్లో నీటి పైభాగంలో మొక్కల మొదళ్ల వద్ద గుచ్చి రసం పీల్చడం వలన సుడులు సుడులుగా ఎండిపోవడం జరుగుతుంది. ఉధృతి ఎక్కువగా ఉంటే పొలం ఎండిపోవడం, పడిపోవడం జరుగుతుంది.

పాడిపంట

నివారణ చర్యలు: దోమపోటు తరచుగా ఆశించే ప్రాంతాల్లో వాటిని తట్టుకొనే రకాలను సాగు చేసుకోవాలి. ప్రతి 2మీటర్లకు 20 సెం.మీ. వెడల్పు కాలిబాటలు తీయాలి. సూచించిన మేరకే నత్రజని పలు దఫాలుగా వాడాలి. పొలాన్ని అప్పుడప్పుడు ఆరబెట్టాలి. ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఎథోఫెన్‌ప్రాక్స్ 2.0.మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

3. ఉల్లికోడు(గొట్టపు రోగం): ఈ పురుగు ఆలస్యంగా నాట్లు వేయడం వలన, పిలక దశలో ఆశిస్తుంది. అంకురం ఉల్లి కాడవలె పొడగాటి గొట్టంలా మారి బయటకు వస్తుంది. కంకి వేయదు. దుబ్బులలో కొన్ని పిలకలు ఉల్లికాడ వలె గొట్టాలుగా మారతాయి.

నివారణ చర్యలు: పిలక దశలో 5శాతం ఉల్లి గొట్టాలు ఏర్పడతాయి. ఆలస్యంగా నాట్లు వేసిన పొలంలో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరానికి 10 కిలోలు లేదా ఫోరెట్ 10జీ గుళికలను 5 కిలోలు నాటిన 10 నుంచి 15 రోజులకు వేసుకోవాలి.

4. అగ్గితెగులు: ఈ తెగులు తెలంగాణ జిల్లాల్లో వరి పండించే అన్ని ప్రాంతాల్లో ఆశించి నష్టపరుస్తుంది. తొలిదశలో ఆకులపైనే నూలుకండె ఆకారంలో మచ్చలు ఏర్పడి క్రమేణా అనుకూల వాతావరణ పరిస్థితులలో ఇవి విస్తరించి మచ్చల చివర్లు మొనదేలి ఉంటాయి. ఈ మచ్చల అంచులు ముదురు గోధుమ లేదా నలుపు రంగులో ఉండి మచ్చల మధ్యభాగం బూడిద రంగు లేదా తెలుపు రంగులో ఉంటాయి. క్రమేణా తెగులు సోకిన ఆకులు ఎండిపోయి దూరం నుంచి చూసినట్లైతే పూర్తిగా తగలబడినట్లు కనిపిస్తుంది. అందువలన అగ్గితెగులుగా పిలవడం జరుగుతుంది.

నివారణ చర్యలు: నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలి. విత్తనశుద్ధి తప్పక పాటించాలి. నత్రజని ఎరువులను సిఫారసు మేరకే మూడు దఫాలుగా వేసుకోవాలి. పొలం గట్లపైన గడ్డి కలుపు లేకుండా చేసుకోవాలి. పైరుపై తెగులు లక్షణాలు కన్పించిన వెంటనే పొలంలో నీటిని తీసివేసి బాగా ఆరనివ్వాలి. దీని వలన శిలీంధ్రం తాలూకా సిద్ధ బీజాలు నశిస్తాయి. ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

5. కాండం కుళ్లు తెగులు: ఈ కాండం కుళ్లు తెగులు స్క్లీరోషియం ఒరైజా అనే శిలీంధ్రం ద్వారా ఆశిస్తుంది. తెగులు పైరు పూర్తిగా పిలకలు తొడిగిన దశ నుంచి పాలు పోసుకొనే దశ వరకు ఎప్పుడైనా వ్యాపించవచ్చు. ముందుగా దుబ్బులోని ఒక కర్ర లేదా పిలకలలోని కింద వరుస ఆకులు పసుపురంగులోకి మారిపోతాయి. తెగులు తీవ్రమైనప్పుడు దుబ్బులోని పిలకలు మొత్తం ఒకదాని తర్వాత ఒకటి పసుపురంగుకు మారిపోతాయి. మొదళ్ల వద్ద ఉన్న కణుపు లోపలి భాగం కుళ్లిపోవడం వలన కాండం బలహీనపడి విరిగిపోతుంది. తెగులు ఉధృతి ఎక్కువైనప్పుడు దుబ్బంతా ఎండిపోయి దిగుబడి తగ్గిపోతుంది.

నివారణ చర్యలు: తెగులు సోకిన పొలం నుంచి విత్తనం సేకరించుకొని విత్తనశుద్ధి పాటించాలి. వేసవిలో లోతు దుక్కులు దున్నుకోవాలి. ఈ విధంగా చేస్తే భూమిలో ఉన్న శిలీంధ్ర బీజాలు బయటకు వచ్చి సూర్యరశ్మి ద్వారా తెగులు కలుగచేసే శక్తిని కోల్పోతాయి. తెగులు గుర్తించిన వెంటనే కార్బండిజమ్ 1 గ్రాము లేదా హెక్సాకొనాజోల్ 2. మిలీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.